# అర్ధాంగి

యన్. శ్రీ కృష్ణారావు

"అబ్బ! ఆడవాళ్ళ కళ్ళు!" — అనుకొన్నాడు, మూడవ తరగతి టిక్కెట్టుతో రెండవతరగతి పెట్టెలో దర్జాగా ప్రయాణం చేస్తున్న మోహన్, తన ఎదురుసీటులో వున్న ఒక అమ్మాయిని చూసి. చిరునవ్వుతో ఆమెను మరోకసారి పరీక్షగా చూశాడు మోహన్.

ఇరవై సంవత్సరాల వయస్సులో వున్నట్టుంటుందనిపించే ఆ అమ్మాయి, చూడటానికి అమరలోకంనుంచి దిగివచ్చిన ఒక అప్సరస! చూసినకొద్దీ చూడాలనిపించే ఆమె అవయవ సౌష్ఠవం! చుట్టి చుట్టి అలిన సిగలో, గుచ్చి గుచ్చి పెట్టిన బొడ్డుమల్లె మొగలదండలా, ఆమె అందమైన ముఖంలో కదిలిన ఆ పెదిమల మధ్య ఆణిముత్యముల వంటి తెల్లటి పళ్ళను తళ తళమని మెరపించిన ఆ నవ్వు! ఆ నవ్వులో తుమ్మెద రెక్కలవలె రెపరెప లాడిన ఆ కనురెప్పల మధ్య, తటాకంలో వికసించిన సరికొత్త తామరపద్మములవంటి విశాల నేత్రాలనుంచి సముద్ర కెరటాలా కొట్టుకు వచ్చిన గిలిగింతలు! "అబ్బ! ఆడవాళ్ళ కళ్ళు!"

తన వైపు మోహన్ చూడటం తెలుసుకొన్న ఆమె చటుక్కున సిగ్గుతో తలదించేసుకొంది. ఆ ఒక్క క్షణంలోనే మోహన్ కళ్ళను కలుసుకొన్న ఆమె కళ్ళకు, అతణ్ణి యీ ప్రపంచాన్నే మర్చిపోయేటట్లు చేయగలిగే మహాశక్తి ఎక్కడినుంచి వచ్చిందో?

పరిగత్తే రైలులో ఒక అందమైన అమ్మాయిని ఆ విధంగా చూస్తే......?

ఆ అమ్మాయి ఒంటరిగా ప్రయాణం చెయ్యటంలేదు. ఆమె పక్కనే ఒక ముసలాయన కూర్చున్నాడు. ఆమెతో ఏవో కబుర్లు చెబుతూన్న ఆయనకు మోహన్‌ని మీద కొంచెం కోపం వచ్చింది. కాని వయస్సులోనూ, అనుభవంలోనూ పెద్దవారైన ఆయన తన కోపాన్ని బయటపెట్టలేదు; పైగా మోహన్‌ని మాటల్లోకి దింపారు.

ఆయన చాలా మర్యాదగానే మోహన్‌ని పలకరించారు.

"ఎందాకా వెళ్తున్నారు?"

ఆ ప్రశ్నతో మోహన్ ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు! "నేను...నేనా తాడేపల్లిగూడెంవరకూ వెళుతున్నాను."

"సొంత ఊరా"?

"కాదండి. కొత్తపల్లి సొంత ఊరు. అది కూడా పేరుకేలెండి!"

"ఓహో! మరి ఇప్పుడు..."

"అక్కడ మా పినతండ్రిగారు ఒకాయన వున్నారు. ఆయన్ని చూద్దామని వెళ్తున్నాను."

"చదువుకొంటున్నారా?"

"చదువుమానేసి చాలా కాలమయిందండి. ప్రస్తుతం ఉద్యోగంలోనే వున్నాను."

"బాగుంది. మీకు పెళ్ళయిందా?"

"ఈ ముసలాళ్ళందరికీ ఇదోక జబ్బు! వయసులోవున్న అబ్బాయి ఎవడేనా కళ్ళకి కనిపిస్తే చాలు—చటుక్కున అడిగేస్తారు. పెళ్ళయిందా? అంటూ" అనుకొన్నాడు మోహన్ తనలోతాను.

"ఇంకా కాలేదండి" అని బదులు చెప్పాడు.

"ఏం? ఉద్యోగం చేస్తున్నానంటున్నారు. మరి ఇంకా పెళ్ళెందుకు చేసుకోలేదు?"

"చచ్చాంరా భగవంతుడా! ఈ ముసలాళ్ళు ఒక్క ప్రశ్నతో వదుల్తారా?" అని అనుకొన్న మోహన్, ఆయన ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

ఆయన పరిహాసంగా నవ్వి,

"ఎక్కడ పనిచేస్తున్నారు?" అన్నారు.

"ఢిల్లీ సెక్రటేరియెట్‌లో సూపరింటెండెంట్‌గా వుంటున్నాను."

"వెరీ గుడ్! ఇంకనేం! ఇంచుమించు నెలనెలా మూడొందలుదాకా సంపాదిస్తున్నారన్న మాట!"

"అన్నీ బాగానే వున్నాయిలెండి. ముప్ఫయ్యో తారీఖు వచ్చేనాటికి మూడు పైసలు కూడా చేతిలో వుండవు!" అంటూ నవ్వాడు మోహన్.

"ఆ! దట్ ఈజ్ నాచురల్! ఇల్లాలనేది ఒకత్తి వచ్చిందంటే, ఇంటినిండా డబ్బే! ఆ సామర్థ్యం అంతా ఆడవాళ్ళకు తెలిసినట్లు మగవాళ్ళకి తెలియదు!"

మోహన్ ఆయన్ని పరీక్షగా చూశాడు. ఆయన ఏ ఉద్దేశ్యంతో మాట్లాడుతున్నాడో అతనికి అర్థంకాలేదు.

"ఏ కాలేజీలో చదువుకొన్నారు?"

"డిగ్రీలేదు! డిప్లొమాలేదు! ఈ రోజుల్లో డిగ్రీలనేవి లెటర్ హెడ్స్‌మీద వ్రాసుకోనేందుకు మాత్రమే పనికొస్తున్నాయి!"

"నిజం! నిజం!"

"స్కూలు ఫైనల్ మాత్రమే ప్యాసయాను పదేళ్ళక్రిందట. అదృష్టవశాత్తూ ఒక గుమాస్తాఉద్యోగం వచ్చింది; చేరాను. ఆ తర్వాత ప్రమోషన్లు వచ్చాయి."

"చాలా అదృష్టవంతులు. మీకు తల్లీ తండ్రీ, అన్నదమ్ములు, అప్పచెల్లెళ్లూ వున్నారా? ఆస్తి ఏమైనావుందా?"

ఈయనగారు ఒక పెళ్ళిళ్ళ పేరయ్య కాబోలు అని అనుకొన్న మోహన్, నవ్వుతూనే జవాబిచ్చాడు.

"నా బంధువులు అని చెప్పుకోవటానికి ఇంకా బ్రతికివున్న ఆయన నా పినతండ్రి ఒక్కడే. ఆస్తి పాస్తులు ఏమీ లేవు."

"ఓహో! ఆయన ఏం చేస్తున్నారు?"

"ఆయనకి కొద్దిగా పొలంవుంది. చిన్న ఇల్లుకూడా సొంతఊళ్లోనే వుంది. తింటం, తిరగటం ఆయనకు పని" అని నవ్వాడు మోహన్.

"ఆయనపేరు?"

"చక్రధరరావు."

తన ఎదురుగావున్న అమ్మాయిని గురించి ఆయన్ని అడగాలనుకొన్నాడు మోహన్. కాని ఆయన అందుకు సందు ఇవ్వకుండా, తనే ఏవేవో ప్రశ్నలు వేస్తూనే వచ్చాడు. ఇంతలోకే చేబ్రోలుస్టేషన్ వచ్చింది. ఆ అమ్మాయి, ఆయనా ఆ స్టేషన్‌లో దిగిపోయారు.

మోహన్ దీర్ఘాలోచనలో పడ్డాడు. తను ఆయనకు చెప్పిన సమాధానాలు జ్ఞాపకం తెచ్చుకొని తనలో తానే నవ్వుకొన్నాడు. ఎదురుగుండా ఒక అందమైన అమ్మాయనేది వున్నట్లయితే, నోట్లోనుంచి అబద్ధా

లకేని వాటంతట వేవస్తాయి కాబోలు అనుకొన్నాడు! ఈ విషయాన్నే తను ఇంటికి చేరేవరకూ ఆలోచిస్తూ నవ్వుకొంటూనే వెళ్ళాడు. ఇల్లు చేరిన వెంటనే, రైలులో జరిగిన సంఘటనను ఒక హాస్యంగా తన పినతండ్రికి చెప్పాడు. ఆయన అంత కన్నా విరగబడి నవ్వారు.

"వెయ్యి అబద్ధాలు ఆడి అయినా, ఒక పెళ్ళి చెయ్యమన్నారు! ఇదీ ఒకందుకు మంచిదే అనుకో" అన్నారు మోహన్ పినతండ్రి.

*   *   *

ఏలూరునుండి బయలుదేరిన ఆ ముసలాయన చేబ్రోలు స్టేషన్ వచ్చే లోపుగా మోహన్ ద్వారా తెలుసుకొన్న విషయాలను ఆధారంగా తీసుకొని ఒక రోజున చక్రధరరావు గారిని కలుసుకొన్నారు. వారి కుమార్తె సుశీలను మోహన్‌కు ఇచ్చి చేయటం విషయమై మాట్లాడారు. ఆయన "తథాస్తు" అన్నారు. ఆ తర్వాత నెలలో వివాహం జరిగింది. రైల్లో అకస్మాత్తుగా కనిపించిన అప్సరస తనకు భార్యగా లభించినందుకు మోహన్ పరవశించాడు. సుశీలను తీసుకొని మోహన్ ఢిల్లీ వెళ్ళిపోయాడు. ముచ్చటగా మూణ్ణెల్లపాటు వారి దాంపత్యం సుఖంగా, సంతోషంగా సాగింది.

ఒక రోజున,—మా నాన్నగారి దగ్గర నుంచి ఏదైనా ఉత్తరం వచ్చిందా?" అని అడిగింది సుశీల భర్తను.

ఆ ప్రశ్నతో ఉలిక్కిపడ్డ మోహన్ కోట్ స్టాండ్‌ను తగిలించివున్న తన కోట్ వైపు చూశాడు.

"ఏం? ఏం రాలేదే!" అన్నాడు.

"ఈ మగజాతి జాతి అంతా ఒక్కటే!" అని అనుకొన్న సుశీల "ఈ ఉత్తరం మా నాన్నగారు కాక మరెవరు రాశారు?" అని అడిగింది, తన చేతిలో ఒక కవరును చూపిస్తూ

మోహన్ కళ్ళు అకస్మాత్తుగా నిప్పులు కక్కాయి! తన భార్య చేతిలో ఒక అసహ్యకరమైన వస్తువు వుండకూడని వస్తువు ఒకటున్నట్లు చూసిన అతను చటుక్కున "ఆ ఉత్తరం ఎందుకు తీశావు?" అని గట్టిగా అరిచాడు.

చాలా సహజంగానే జవాబిచ్చింది

# అర్ధాంగి

సుశీల. "చిల్లర డబ్బులు కావలసి వచ్చాయి జేబులో చూశాను. ఉత్తరం కనిపించింది. తీశాను."

"ఎవర్నడిగి నా జేబులో చెయ్యిపెట్టావు?"

"భర్త జేబులో చెయ్యిపెట్టటానికి భార్య ఎవర్ని అడగాలి?"

"భర్తనే అడగాలి!"

"అవసరం లేదు."

"వాట్ !!" అని ఉగ్రుడై పోయాడు.

"ఏనాడయితే నా మెళ్లో మంగళసూత్రమనేదాన్ని కట్టారో ఆనాటినుంచీ మిమ్మల్ని అడక్కుండానే మీ జేబులో చెయ్యి పెట్టే హక్కుకూడా నాకువచ్చింది పైగా ఆ ఉత్తరం నా పేరుకే వచ్చింది. అందుకనే చింపిచూశాను"

"ఓహో! అయితే నీ దవడ వాయించే హక్కుకూడా నాకుంది," అంటూ ఆమె దవడలను 'ఫళార్' 'ఫళార్' మని మ్రోగించాడు మోహన్.

ఆ దెబ్బలతో చెదిరిపోయింది సుశీల. తన భర్తకు చెయ్యెత్తి కొట్టటంకూడా తెలుసునని ఆనాడే తెలుసుకొంది.

కోట్ స్టాండ్ మీదవున్న తన బట్టలు గబగబా తొడుక్కుని ఖంగారు ఖంగారుగా యింట్లోనుంచి వెళ్ళిపోయాడు మోహన్. భర్త విచిత్రచర్య ఆమెకు అరంకాలేదు.

కందిన దవడలను తడుముకొంటూ ఖంగారుగా ఇంట్లోనుంచి వెళ్ళిపోతున్న భర్తను "భోజనం చెయ్యరా?" అని అడిగింది సహజంగానే. ఆమె అడిగినప్రశ్న అతను వినిపించుకోనికూడా, జవాబు చెప్పకుండా తనని ఎవరో తరుముకొస్తున్నట్లు ఇంట్లోనుంచి విసురుగా వెళ్ళిపోయాడు.

* * *

ఢిల్లీ మునిసిపల్ ఆఫీసులో తన సీటులో వెళ్ళి కూర్చున్న మోహన్ మనస్సు ఒక స్థితిలో లేదు. పరిపరి విధాల దుఃఖించాడు. అతని కళ్లముందు తన మామగారు వ్రాసిన ఉత్తరం ఒక ఫోటోగ్రాఫ్‌లా ప్రత్యక్షమయింది. రవ్వలు రాలుస్తూ వేగంగామీదకు వచ్చే బాంబులా కనిపించింది ఉత్తరం. భయపడి ఒకక్షణం కళ్లు మూసుకొన్నాడు.

"ఈ మూడ్నెల నుంచి సుఖంగా సాగుతున్న సంసారాన్ని కూలద్రోయటానికి కాలాంతకుడిలా వచ్చిందే ఆ ఉత్తరం!" అనే ఆలోచన కలిగేసరికి ఆఉత్తరం బొమ్మ అతని కళ్లముందునుంచి మాయమయింది.

రాత్రికు టైము చూసుకోనేందుకు తలాపు దిక్కునవుంచే "రేడియం డయల్" గడియారాన్ని చూసినప్పుడు, గడియారం రూపం కనిపించకపోయినా, గడియారం ముళ్ళు అంకెలు కనిపించినట్లు ఆ ఉత్తరం రూపం మాయమయినా, అందులోని కొన్ని విషయాలు—కొన్ని ముఖ్య విషయాలు—అతనికి ఇంకా కనిపిస్తూనే వున్నాయి ఆ మాటలు—ఒక్కొక్కమాట ఒక్కొక్క శూలం పోటులా అతని మనస్సును పొడిచివేశాయి! అతని కళ్ళవెంట పశ్చాత్తాపంతో నీళ్ళు జలజలమని రాలాయి!

"...ఢిల్లీనుంచి జానకిరామయ్యగారు వచ్చారు. ఆయన నీకు జ్ఞాపకమున్నాడనే అనుకొంటున్నాను ఆయన చెప్పాడు—నా అల్లుడు—మీ ఆయన—మునిసిపల్ ఆఫీసులో బిలు కలెక్టరుకదూ?—సెక్రటేరియేట్‌లో పెద్ద సూపరింటెండెంట్ అనీ, మూడొందలు జీతమనీ చెప్పిన విషయాలన్నీ అబద్ధమేనా?...ఇదంతా నిన్ను అపహరించటానికి......వేసిన దొంగ ఎత్తేనా? ఆడపిల్లల్ని కని, పెంచి, పెద్దచేసి, పెళ్ళిచేసి వాళ్లు సుఖంగా కాపరం చెయ్యాలని ఆశపడేకన్న తల్లి తండ్రులను మోసంచేసే ఇటువంటి దుర్మార్గులను ఊరికే వదలకూడదు......ఆ దొంగ రాస్కెల్‌కు తగిన గుణపాఠం నేర్పుతాను...కోర్టు కెక్కించి ముప్పు తిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తాను... వెంటనే బయల్దేరి ఇంటికి వచ్చేయి..."

మోహన్ తనలోతనే కుమిలిపోయాడు. "అరచేతిలోనే అరవిందం వుందన్నట్లు అబద్ధాలాడిన నేను సుశీలముఖం ఎల్లాచూడను? ముంజేతి కంకణానికి అద్దంకూడా కావాలా అన్నట్లు నా దొంగజీవితం అంతా సుశీలకి తెలిసిపోయిందే! నేనొక సామాన్య బిల్ కలెక్టరని తెలుసుకొన్న సుశీల నన్నెంత హీనంగా చూస్తుంది? ఎంత నీచంగా భావిస్తుంది?...ఛ! నేనెంత తెలివితక్కువపని చేశాను! చదివిన వెంటనే ఆఉత్తరాన్ని చింపి అవతల పారవెయ్యకుండా, పరధ్యాన్నంగా జేబులో పెట్టుకోవటం ఎంత అవివేకం? సుఖంగా సాగుతున్న సంసారాన్ని కూల్చివేసిందే ఆ దరిద్రపుఉత్తరం!..."

తన భార్యకు మరెవ్వరూ చెయ్యని ద్రోహాన్ని తాను చేసినట్లుగా దుఃఖించాడు. అందుకు ప్రాయశ్చిత్తంగా ఆమె ముఖం చూడ్డానికికూడా సిగ్గుపడ్డాడు. అవమానం వల్ల కలిగిన విరక్తి కారణంగా ఎక్కడికైనా పారిపోవాలనే, అల్పబుద్ధికూడా కలిగింది. ఆత్మహత్య చేసికోవాలనికూడా అనుకొన్నాడు!

తల్చుకోకూడని పిరికిపనులు చెయ్యటానికి ఆలోచించినప్పటికి, మూడ్నెల్లముందే ఆ పెద్ద పట్టణానికి కొత్తగావచ్చిన తనభార్య ఒంటరిగా బాధపడుతుందేమోననే జాలి కూడా అతనికి కలిగింది. జాలితోపాటు, ఆమెను అనవసరంగా కొట్టాననే పశ్చాత్తాపంకూడా కలిగింది. అదే సమయంలో ఆ రోజు ఒకటవ తారీఖు అని, జీతాలుయిచ్చే రోజుఅనీ జ్ఞాపకంవచ్చింది. జీతాన్ని పుచ్చుకొని ఒక కవరులోపెట్టి ఆమెకు చేర్చినట్లయితే ఆమె తన తండ్రివద్దకు వెళ్లగలుగుతుంది అనుకొన్నాడు.

మధ్యాహ్నం అతని జీతం యాభయి రూపాయలూ పుచ్చుకొన్నాడు. అంతకుముందే ఒక చిన్న ఉత్తరం కూడా రాసివుంచాడు. ఆ ఉత్తరం ఆ డబ్బూ ఒక కవరులోపెట్టి కవరు అంటించాడు. ఇంటి


## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్ని, నీ సరియైన దర్యాప్తునుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేది లగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జిలు ప్రత్యేకం) దుష్గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగటా మీకు తృప్తిగా నుండనియెడల సొకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

సందుదాకా వచ్చాడు. ముందూ వెనుకా దిక్కులు చూసుకొంటూ, వెతకబోయిన తీగ కాళ్లకు తగిలినన్నట్లు, పక్కింటివాళ్ల అమ్మాయి అటునైపే రావటంచూసి అతను కొంచెం సంతోషించాడు.

"పాపా! ఇల్లా రామ్మా! ఈ కవరు తీసికెళ్లి మీ సుశీల అక్కయ్యకు ఇచ్చేస్తావా?"

"ఓ! అలాగే! ఈ ఉత్తరాన్ని సుశీల అక్కయ్య పోస్టులో వెయ్యమంది. అందుచేత ముందు ఇది పోస్టులో వేసి వెళ్ళేటప్పుడు యిస్తాను," అంది

"సుశీల అక్కయ్య యిచ్చిందా?" అంటూ చటుక్కున ఆ పాప చేతిలోని ఉత్తరాన్ని లాక్కుని ఖంగారుగా కవరు చింపాడు మోహన్. తన మామగారికి సుశీల వ్రాసిన ఉత్తరం అది.

మహారాజశ్రీ నాన్నగారికి—

నమస్కారములు. మీరు వ్రాసిన ఉత్తరం చేరినది. ఉత్తరమా అది? రెండణాల కవరొకటి చౌగ్గా దొరికిందికదా అని, రెండు పేజీలు మీ ఇష్టం వచ్చినట్లల్లా రాసి వేశారు! ఒక కాలేజీ ప్రిన్సిపాల్‌గా సంవత్సరాల తరబడి ఉద్యోగం చేసిన మీరేనా ఆ ఉత్తరం రాశారు? కన్నతండ్రి కూతురికి అటువంటి ఉత్తరం రాస్తారా?

ఎవళ్లో ఏవో వాలుకు మాటలు అన్నంత మాత్రాన అదంతా నిజమేనని నమ్మేసి మీరు నాకు ఇటువంటి ఉత్తరం వ్రాయటం మీకు అవమానంగా తోచలేదా? జా[illegible]య్య సంగతి మీకు ఇవాళేనా తెలిసింది? ఆయన నోరు విప్పితే, పచ్చని పచ్చిగడ్డికూడా భగుమని మండిపోతుందనే సంగతి మీరు ఎరగనిదా? అతడి మాటలన్నీ నమ్మేసి రాయకూడని మాటలన్నీ రాసింది నిజంగా మీరేనా?

"వెంటనే బయల్దేరి ఇంటికి వచ్చేయి"! —ఎంత తేలిగ్గా రాశారు నాన్నా ఈ మాట! మీరు అనుకొన్నంత తేలిగ్గా తెగిపోయే బంధమేనా దాంపత్యమనేది? నేను మీ కన్న కూతురినే కావచ్చు నామీద మీకు అపారమైన ప్రేమాభిమానములు వుంటే వుండవచ్చు. కాని మీరు ఒక్క విషయం—అతి ముఖ్యమైన విషయం—మర్చిపోయారు! ఏ క్షణంలో నా మెళ్ళో మంగళసూత్రమనేది కట్టబడిందో ఆ మరుక్షణంనుంచీ నేను మరొకరి సొత్తు! వయస్సులోనూ, విజ్ఞానంలోనూ పెద్దవారైన మీకు ఈ విషయంలో ఎక్కువగా చెప్పనవసరం లేదనే అనుకొంటున్నాను.

అదృష్టవశాత్తూ మీరు వ్రాసిన ఉత్తరం ఆయన చూడలేదు. ఆయన ఉద్యోగం ఎటువంటిది అనే విషయం నాకు అనవసరం. ఆయన ఎటువంటి ఉద్యోగం చేసున్నప్పటికీ, నాకు సంబంధించినంతవరకూ ఆయన నా భర్త. నేను ఇక్కడ ఆయనతో చాలా సుఖంగా, సంతోషంగా వుంటున్నాను. ఆయన నన్ను ఎంతో ప్రేమగా చూసుకొంటున్నారు నాకు ఏ లో[illegible]లేదు. మీరుగాని అమ్మగాని నా గురించి ఏమీ బెంగపెట్టుకో నక్కర్లేదు. అమ్మకు నా నమస్కారములు చెప్పండి.

మరొక విషయం! ఇప్పుడే చెప్పివేయదల్చుకొన్నాను. ఏ విషయమై తెలుసుకోవాలని అనుకొంటూ ఆశగా అమ్మ ఎదురు చూస్తూ వుంటుందో ఆ విషయమే చెప్పదలచుకొన్నాను. అమ్మతో చెప్పండి. ఇప్పుడు మూడో నెల!

—మీ కుమార్తె, సుశీల."

ఉత్తరాన్ని చదివిన మోహన్ కళ్లవెంట కన్నీటిధారలు కారాయి "నిన్ను అర్థం చేసుకోలేక ఎంతబాధ పెట్టాను సుశీలా?" అనుకొంటూ ఇంట్లోకి పరిగెత్తాడు.

సంగతేమిటో తెలియక తెల్లబోయి చూసింది పక్కింటివారి పాప! ★


అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX— ADVICE పొందవచ్చును. మీకు తోచుకొన్న లక్షణములు వ్రాయుమా, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్సు, హైదరాబాద్-2.
(దక్కన్)





"నా లైసెన్సు చూపించమంటావా? వహ్వా! భేషుగ్గావుంది నీధోరణి! క్రితంసారి కోర్టు కెళ్లినప్పుడు, మీ జడ్జీదాన్ని తీసేసుకున్నాడుకదూ!"